లుచ్ఛాపనుల్ని నేను సాగనిస్తననుకోకు. ఉప్పలయ్యగాన్నీ, సర్పంచ్‌గాన్ని పట్టుకోంగానే నీ పనులన్నీ అయిపోయినవనుకోకు. అబద్ధం చెప్పినందుకు నిన్ను జైళ్ళ బెట్టిస్త. ఏమనుకుంటున్నావో" అంటూ పోచయ్య గబుక్కున లేచి నిల్చొని వెళ్ళిపోయాడు.

"అన్నా... పోచన్నా... గంత కోపమెందుకే పోచన్నా" అంటూ పిలుస్తున్న వెంకటయ్య మాటల్ని వినిపించుకోకుండానే పోచయ్య వెళ్ళిపోయాడు.

వెంకటయ్య వెంటనే ఉప్పలయ్య దగ్గరకు పరిగెత్తాడు. అప్పుడు ఉప్పలయ్య ఇంట్లోనే ఉన్నాడు.

"గా పోచయ్య మన మీద కారాలు మిరియాలు నూరుతాండు. ఆర్ అండ్ బి వోళ్ళతోటి అబద్ధం చెప్పినందుకు నన్ను జైళ్ళ బెట్టిస్తడట" అన్నాడు వెంకటయ్య.

"వాని బొంద. వానితోటేమయితది. మొన్నటి ఎన్నికలల్ల వాన్ని, వాని పార్టీని చిత్తుచిత్తుగ ఓడిస్తిమి. అయినా, వానికి బుద్ధి రాలేదు. రాజకీయం వదిలిపెట్టి చప్పుడు జేక ఇంట్ల కూర్చుంటడనుకున్న. వానికిజ్జత్ లేదు. మల్ల రాజకీయం జేస్తనని వస్తున్నడు" అన్నాడు.

"వానితోటి మనకు పంచాయితెందుకు? మా ఇంట్లో టీవీ లేదు, ఫ్రిజ్ లేదు, మేం పెట్టింది ఓటకు కర్ర కాదని మనం బొయి ఆర్ అండ్ బి వోళ్ళకు చెప్పొద్దాం పా" అన్నాడు వెంకటయ్య.

"అంతయిపోయినంక గా లుచ్ఛాగాడొచ్చి బెదిరియ్యంగనే నువ్వు గిట్ల బెదురుడేంది? వాడేం జెయ్యలేడు. పైనించి కింది దాక అందరూ మా పార్టీవోళ్ళే. కావాల్నంటె గా పోచయ్యగానికూడా ఇంత మేత పడేద్దాం. వాడే నోరు మూసుకుంటడు. నువ్వేం భయపడకు. పోచయ్యగాని నోరు మూయించే భారం నాది" అన్నాడు ఉప్పలయ్య. వెంకటయ్య మరో మాట మాట్లాడకుండా ఇంటికి తిరిగొచ్చాడు.

వారం రోజుల తర్వాత వెంకటయ్యను ఉప్పలయ్య మరోసారి టౌన్‌కు తీసుకెళ్ళాడు. మళ్ళీ అదే హోటల్లో రూమ్ తీసుకున్నారు. భోజనం చేశాక ఇద్దరు కలిసి ఆర్ అండ్ బి ఆఫీసుకు వెళ్ళారు. ఉప్పలయ్య అక్కడ చాలామందిని కలిశాడు. తర్వాత ఇన్సూరెన్స్ కంపెనీవాళ్ళ దగ్గరకు వెళ్ళారు. సాయంత్రం వరకు పని పూర్తిచేసుకుని ఇద్దరూ మళ్ళీ హోటల్‌కు చేరుకున్నారు.

రాత్రి ఉప్పలయ్య తాను దిగిన హోటల్‌కు చాలామందిని పిలిపించుకొని వాళ్ళకు పెద్ద పార్టీ ఇచ్చాడు. మొత్తం బిల్లంతా వెంకటయ్యే చెల్లించాడు. అందరూ వెళ్ళిపోయాక, "మన ఫైలు మూవ్‌మెంట్ల ఉన్నది. నీకు చాలా పైసలొస్తయి. ఇప్పుడు పైసలు ఖర్చయితానయని ఏం రంధి పెట్టుకోకు" అన్నాడు ఉప్పలయ్య.

"అంతా ఆ ఎమ్మెల్ల రాజన్న దయ" అన్నాడు వెంకటయ్య.

ఆ మర్నాడు వాళ్ళిద్దరూ మళ్ళీ వాళ్ళ ఊరు చేరుకున్నారు.

మరో రెండు వారాల తర్వాత ఉప్పలయ్యొచ్చి వెంకటయ్యను కలిశాడు. "మన ఫైలు ఇప్పుడు ఆర్ అండ్ బి నుంచి కలక్టరేట్‌కు బోయింది. మనమోసారి మల్ల టౌన్‌కు బొయి కలెక్టర్‌ను కలిసి రావాలె" అన్నాడు ఉప్పలయ్య.

వాళ్ళు మళ్ళీ టౌన్‌కెళ్ళారు. మళ్ళీ హోటల్లో దిగారు.

మళ్ళీ పార్టీ జరిగింది. ఈసారి కొందరు కొత్తవాళ్ళొచ్చారు.

మర్నాడు వాళ్ళు వాళ్ళ సర్పంచ్‌ను కలిశార్లు. సర్పంచ్ వెళ్ళి ఎం.ఎల్.ఏ సాబ్‌ను కలిశాడు. ఎం.ఎల్.ఏ సాబ్‌ను తీసుకొని కలెక్టర్ ఆఫీసుకు వెళ్ళారు. కలెక్టర్‌ను కలిశారు. కలెక్టర్ మీ పనయిపోయిందని చెప్పాడు.

తర్వాత వెంకటయ్యను తీసుకొని ఉప్పలయ్య కలెక్టర్ ఆఫీసులో నష్టపరిహారం చెల్లించే సెక్షన్‌కు వెళ్ళాడు. అక్కడున్న క్లర్కు వెంకటయ్యతో అతని దగ్గరున్న ఫైలు మీద చాలా చోట్ల సంతకాలు పెట్టించాడు. "తొందర్లోనే మీకు చెక్కు అందుతుం"దని చెప్పాడు.

రెండు వారాల తర్వాత ఆ ఊర్లో అధికార పార్టీవాళ్ళు ఒక సభను ఏర్పాటు చేశారు.

ఆ ఊర్లో కొత్తగా మంచినీళ్ళ సప్లై కోసం ఓ వాటర్ ట్యాంకును నిర్మించారు.

దానికి ప్రారంభోత్సవం చెయ్యడానికి ఆ ఊరికారోజు ఎం.ఎల్.ఏగారొస్తున్నారు.

ఆ రోజే ఎం.ఎల్.ఏ గారి చేతుల మీదుగా వెంకటయ్యకు చెక్కు అందుతుందని చెప్పారు.

మీటింగ్‌కు జనం చాలామందే వచ్చారు.

ఆ ఊరి సర్పంచ్, ఎం.పి.టి.సి మెంబర్లు, జడ్.పి.టి.సి మెంబర్లు, జిల్లాలోని ఇతర నాయకులు- అందరూ వచ్చారు.

ఊర్లో చాలామందికి వెంకటయ్య ఇంటిని బ్లాస్ట్ చేసినందుకుగానూ అతనికి ప్రభుత్వం మూడు లక్షల రూపాయల్ని నష్టపరిహారంగా ఆ రోజు చెల్లిస్తున్నారని తెలిసిపోయింది.

"మూడు లక్షలే!" అంటూ చాలామంది కనుబొమలెగరేశారు.

కొందరైతే మూడు లక్షలా? గా గూన పెంకుల ఇల్లుకు మూడు లక్షలా? రేపు అన్నల దగ్గరకు బొయి 'మా ఇండ్లని గూడ బ్లాస్ట్ చెయ్యండ్రి బాంచెను' అని చెప్పొద్దాం" అని అన్నారు.

సభ బ్రహ్మాండంగా జరిగింది.

ఊరినంతా రంగురంగుల జెండాలతో అలంకరించారు. ఆ ఊరిని మెయిన్ రోడ్డుతో కలిపే అప్రోచ్ రోడ్డు పరమ అధ్వాన్నంగా తయారైతే ఆ రోడ్డు మీద రాత్రికి రాత్రే ట్రాక్టర్లతో మొరం పోయించి, కార్లు కుదుపులు లేకుండా ప్రయాణం చెయ్యడానికి అనుకూలంగా మార్పించాడు.

ఆ రోజు మధ్యాహ్నం పన్నెండింటికి సభ అని కరపత్రాలు వేయించారు.

ఊరి బయటున్న స్కూలు ముందు పెద్ద టెంట్



